ప్రజాశక్తి
సోమవారం 17 మార్చి 2025
I
అల్లూరి సీతారామరాజు



ములియగుడలో సిసి కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి -అనంతగిరి:ప్రముఖ పర్యాటక కేంద్రమైన ములియగుడ కూడలి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని టోకురు పంచాయతీ సర్పంచ్ కిల్లో. మోసియా తెలిపారు. అరకు సీఐ హిమగిరి, స్థానిక ఎస్సై. శ్రీనివాసరావు సూచనల మేరకు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ రోడ్డు మీదుగా పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలు, కటికి జలపాతాలకు విదేశీ ప్రాంతాలకు చెందిన వేలాదిమంది పర్యాటకులు వస్తుంటారన్నారు. ఈ దృష్ట్యా సీసీ కెమెరాలు అమర్చడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దొన్ను, స్థానిక మోటార్ ఫీల్డ్ సిబ్బంది రామ ప్రవీణ్, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.



సిసి కెమెరా వద్ద నాయకులు

సాగు భూములు అన్యాక్రాంతం

- సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో గిరిజనుల ఆవేదన



అనంతగిలో నినాదాలు చేస్తున్న నాయకులు, గిరిజనులు

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని నాన్ షెడ్యూల్ గుమ్మ కోట, గరుగుబిల్లి, భీంపోలు, ఎన్ ఆర్ పురం పంచాయతీలలో సాగులో ఉన్న గిరిజన రైతుల భూములు అన్యక్రాంతం కాపాడాలని మండల సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు, సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆదివారం గుమ్మకోట పంచాయతీ పరిధి గుజ్జల్లి చుట్టు పక్కల గ్రామాలలో సిపిఎం నాయకులు ఎస్ నాగులు, జెష్ఠ. వెంకటరమణ సందర్శించారు. గిరిజన ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు గిరిజనులు మాట్లాడుతూ, తమ సాగు భూములు మైదాన ప్రాంతాలకు చెందిన భూ స్వాములు అక్రమంగా దోచుకుంటున్నారని, రక్షణ కల్పించాలని గిరిజనులు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు గిరిజనులు పాల్గొన్నారు

అరకులోయ రూరల్:సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజా చైతన్య యాత్ర లో భాగంగా ఆదివారం మండలంలోని బస్కి పంచాయితీ మొర్రిగుడలో సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు, మాజీ ఎంపీటీసీ బి దశరథ్ పర్యటించారు. గిరిజనులతో మాట్లాడుతూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలం బస్కి పంచాయితీ మరి మొర్రిగూడ గ్రామానికి చెందిన గిరిజనులు భూమి పట్టాల్లో డుంబ్రిగుడ మండలం పేర్లు ఉన్నాయని, నేటి వరకు అరకువేలి మండలం పేరు మారలేదని తెలిపారు. దీంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు



సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

పడుతున్నారన్నారు. దీనిపై అనేకసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమస్యను తీసుకెళ్లినా పరిష్కరించ లేదన్నారు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పట్టా మార్పులు, చేర్పులు చేయాలని డిమాండ్ చేశారు.గ్రామంలో తాగునీరు సమస్య తీవ్రంగా ఉందన్నారు. మెర్రిగుడ గ్రామంలో సిసి రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీలు ఎక్కడికక్కడే నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తాంగుల మొంగ్లు అప్పన,తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్:పీఎం జన్మన్ పథకంలో కేంద్ర ప్రభుత్వం పీవిటీజిలకు మంజూరు చేసిన ఇల్లులకు 10 లక్షల రూపాయలు పెంచి ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు.ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ప్రజా చైతన్య యాత్ర లో భాగంగా ఆదివారం మండలంలో సిరగం పంచాయతీ పివిటీజీ గ్రామాలైన సంధివలస లో పర్యటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే డబ్బులు ఏ మూలకు సరిపోవని, సిమెంటు, ఐరన్ ఇతర గృహ సామగ్రి ధరలు పెరిగిపోయాయన్నారు. పది లక్షలు ఇస్తేనే పూర్తిస్థాయిలో ఇల్లు నిర్మించుకోవచ్చని తెలిపారు. గ్రామాల్లో రోడ్లు, మంచినీరు సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. ఈనెల 24వ తేదీన జరిగే ధర్నాకి గిరిజనులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఐసుబాబు, పాంగి నాగేష్, మురళి, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

- కేంద్రాల్లో సౌకర్యాల కల్పన - 'ప్రజాశక్తి'తో డిఇఒ పి.బ్రహ్మాజీరావు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పదో తరగతి పరీక్షలు అనగానే చాలామంది తెలియని ఒత్తిడికి గురవుతుంటారు. ప్రశాంత వాతావరణంలో ధైర్యంగా పరీక్ష రాసేలా పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు చేస్తున్నట్లు డిఇఒ పి.బ్రహ్మాజీరావు తెలిపారు. పరీక్షల కోసం విద్యార్థులను అన్ని రకాలుగా సిద్ధం చేసినట్టు వెల్లడించారు. గతేడాది కంటే ఈసారి మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని లక్ష్యంతో ఉన్నామన్నారు. ఈనెల 17 నుంచి పరీక్షలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు వివరాలను ఆయన ప్రజాశక్తికి వివరించారు.

ఎన్ని కేంద్రాలు ఏర్పాటు చేశారు

అల్లూరి జిల్లా వ్యాప్తంగా 71 పరీక్ష కేంద్రాల్లో 258 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 11,766 విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. రెగ్యులర్ విద్యార్థులు 11,564 మంది, ప్రైవేట్ విద్యార్థులు 202 మంది ఉన్నారు. పాడేరు డివిజన్ పరిధిలో 43, రంపచోడవరం పరిధిలో 28 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు ఇవ్వకూడదని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎన్నికల నిర్వహణ అధికారులకు సూచించాం. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నాం.

9 గంటల నుంచే అనుమతి

పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరగనున్నాయి. విద్యార్థులు వారికి కేటాయించిన కేంద్రాల వద్దకు ముందుగానే చేరుకోవాలి. విద్యార్థులను కేంద్రాల్లోకి ఉదయం 9 గంటల నుంచే అనుమతిస్తారు. ఒక్క నిమిషం నిబంధన లేకున్నా విద్యార్థులు సకాలంలో హాజరు కావాలి. కేంద్రంలో పూర్తి సమయం ఉండాలి.





పూర్తిస్థాయి వసతులు..

పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాసేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్తు సౌకర్యం, వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో వైద్య సిబ్బంది అత్యవసర వేళల్లో ప్రాథమిక చికిత్స అందించేందుకు సిద్ధంగా ఉంటారు. పరీక్ష రాసే విద్యార్థులంతా బెంచీలు పైనే కూర్చుని రాసేలా ఏర్పాటు చేస్తున్నాం. వీటన్నింటి కోసం ఆయా విభాగాలకు సంబంధించిన అధికారులతో ఇప్పటికే సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాం.

పటిష్ట నిఘా ఏర్పాటు

పరీక్షల్లో చూసి రాతలకు, స్లిప్పులు పెట్టి రాసేందుకు అవకాశం లేకుండా చర్యలు తీసుకున్నాం. గతంలో పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని జిల్లాలోని ఆయ పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నాం. పరిసర ప్రాంతాల్లో పోలీస్ సెక్షన్ 144 అమలు ఉంటుంది. 4 ఫ్లయింగ్, సిట్టింగ్, ఇతర స్క్వాడ్ లతో ఆకస్మిక తనిఖీలు ఉంటాయి. పరీక్ష కేంద్రాల హెచ్ఎం లు చీఫ్ సూపరిండెంట్ లుగా వ్యవహరిస్తారు.

మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా

టెన్త్ పరీక్షలకు పకడ్బందీ చర్యలు



సీలేరు పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఇఒ బ్రహ్మాజీరావు

ప్రజాశక్తి -సీలేరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పగడ్బందీ చర్యలు చేపడుతున్నామని డిఇఒ బ్రహ్మాజీరావు అన్నారు. ఆదివారం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని టెన్త్ పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లుపై పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో 71 పరీక్ష కేంద్రాలో 258 హైస్కూళ్లకు చెందిన 11760 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. ఇప్పటికే పోలీస్‌స్టేషన్లకు ప్రశ్నాపత్రాలు చేరుకున్నాయన్నారు. కేంద్రాల్లో మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా ఇతర శాఖలకు చెందిన అధికారులను అన్ని పరీక్ష కేంద్రాల్లో సిటింగ్ స్క్వాడ్‌లుగా ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటుచేసిన సిసి కెమరాలను పాడేరు ఐటిడిఎలో ఏర్పాటు చేసిన మోనటరింగ్ విభాగానికి అనుసంధానం చేసి, అన్ని కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్న తీరుపై పర్యవేక్షణ ఉంటుందన్నారు. అల్లూరి జిల్లాకు నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు అనుమతిరాగా, మరో నాలుగు అదనపు బృందాలను ఏర్పాటుచేసి, పటిష్ట నిఘా, పర్యవేక్షణ ఏర్పాటు చేశామన్నారు. నిధుల కొరతతో జిల్లాలోని పలు పాఠశాలల భవన నిర్మాణాలు నిలిచిపోయాయని, ఇటీవల రూ.పది కోట్ల నిధులు మంజూరైన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు పనులు చేపట్టి పూర్తిచేస్తామన్నారు. జిల్లాలో మరొక 460 పాఠశాలలకు భవనాలు అవసరమని గుర్తించి, కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపామన్నారు.కార్యక్రమంలో హెచ్ఎం నాగభూషణం, ఉపాధ్యాయులు దామోదర్ వెంకటరత్నం పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్నఐటిడిఎ పిఒ సింహాచలం

ప్రజాశక్తి -రంపచోడవరం : ఆంధ్ర ప్రత్యేక రాష్ట్రం కోసం ఆమరణ దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములును గుర్తుంచుకునే బాధ్యత తెలుగు ప్రజలు అందరిపై ఉందని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం అన్నారు. ఆదివారం స్థానిక ఐటిడిఎ సమావేశపు హాలులో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు జయంతిని పలు కార్యాలయాల్లోనూ నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, పిహెచ్ఓ కె.చిట్టిబాబు. డిఈ చైతన్య, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం కార్యాలయ సూపర్డెంట్ రాజారెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు పి వెంకటేశ్వరరావు, బి. రాజు, పి.భీమిరెడ్డి, పి.లక్ష్మిరెడ్డి, శివ, శ్రీకాంత్, బి. మార్గదర్శి,గణేశ్వరరావు, చదల సోమిరెడ్డి, కత్తుల సోమిరెడ్డి, సబ్ స్టెంట్లు అప్పలస్వామి, నూకరాజు, నాగరాజు, శోభన్ బాబు పాల్గొన్నారు.

నేడు మండల కేంద్రాల్లో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - సీలేరు: జీకే వీధి మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తహశీల్దార్ రామకృష్ణ తెలిపారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు మండల కేంద్రంలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తమ సమస్యలపై అర్జీలను సమర్పించవచ్చున్నారు. సంబంధిత శాఖాధికారులు వాటిని పరిశీలించి, పరిష్కరిస్తారన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సమస్యలను అందించేందుకు ప్రజలు ఆర్‌డిఒ, జిల్లా కలెక్టరేట్, ఐటిడిఎ పిఒ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. అన్ని శాఖల అధికారులు మండల కేంద్రంలో జరిగే పిఆర్‌జిఎలో అందుబాటులో ఉంటారని, ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని నివాళులర్పించారు. డిటి, ఆర్ఐ మహాదేవ్ పాల్గొన్నారు.

విద్యార్థి దశలో సినిమాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - పాడేరు : లైంగిక దాడులకు పాల్పడితే పోక్సో కేసు నమోదు చేస్తామని విశాఖ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ఆలపాటి గిరిధర్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక శ్రీకృష్ణాపురం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ అధ్యక్షురాలు ఎం. వి .శేషమ్మ అధ్యక్షతన పోక్సో చట్టం పై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైంగిక దాడులకు పాల్పడే వారికి పది నుండి 15 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థి దశలో సినిమా ప్రభావాలకు లోన్ కాకుండా ఉన్నతంగా చదువుకోవాలని సూచించారు. పొగడ్తలకు వ్యసనాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. బాహ్య సౌందర్యాన్ని చూసి ఎదుట వారి వ్యక్తిత్వాన్ని అంచనా వేయకూడదని సూచించారు. సమాజంలో కొంతమంది వ్యసనాలకు బానిసై అవినీతికి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థి దశలో అందరూ సిన్సియర్గా ఉండాలని అనుకుంటారని చెప్పారు. నేరం జరిగినప్పుడు మనకెందుకులే అని సమాచారం అందించకపోవడం నేరమని పేర్కొన్నారు. తెలిసిన సమాచారాన్ని బాధ్యతగా పోలీసులకు తెలియజేయాలని చెప్పారు. మత్తు పదార్థాలకు డ్రగ్స్ కు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు.

జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ అధ్యక్షురాలు ఎం వి శేషమ్మ మాట్లాడుతూ, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో సినిమా ప్రభావాలకు లోన్ కాకుండా దూరంగా ఉండాలని సూచించారు. అడిషనల్ ఎస్పీ ధీరజ్ మాట్లాడుతూ, మభ్యపెట్టి పాల్పడితే కేసు నమోదు చేస్తామని చెప్పారు. ఫోక్సో చట్టంపై అందరికీ అవగాహన ఉండాలని చెప్పారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ సీలేరు, చింతపల్లి, పాడేరులో ఫోక్సో చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. చెప్పారు. అనంతరం ఆపద సమయంలో ఆపద సమయంలో మీకోసం ఉమెన్ చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ల తో రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో చోడవరం సబ్ జడ్జి వి. గౌరీ శంకర్, అనకాపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ ధర్మారావు, ఐసిడిఎస్ పిడి పి. సూర్యలక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఎల్. రజిని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా, జిల్లా విద్యాశాఖ అధికారి పి. బ్రహ్మాజీరావు, పాడేరు తాహసిల్దార్ వి. త్రినాధ రావు నాయుడు,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల పాల్గొన్నారు.

50 మేకలు సజీవ దహనం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని పెదపూడి గ్రామపంచాయతీ శివారు రాజుపాలెం లో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో గ్రామానికి చెందిన నమ్మి చిలుకు, నమ్మి పైడయ్యకు చెందిన మూడు పశువుల పాకలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో వీరికి చెందిన 50 పైగా మేకలు సజీవ దహనమయ్యాయి. జీవనాధారంగా పెంచుకునే మేకలు అగ్నిప్రమాదంలో కాలి బూడిదవ్వడంతో బాధిత కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఆస్తి నష్టం సుమారు రూ.ఐదు లక్షల పైగా ఉంటుందని బాధితులు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ఉగాది వేడుకలను వైభవంగా జరుపుకోవాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఉగాది వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు కోరారు. స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, పూర్వం ఉగాది పండుగను ప్రతి గ్రామంలో జరుపుకునే వారని, ప్రస్తుతం పండుగలు క్రమంగా కనుమరుగవుతున్నట్లు తెలిపారు.నేటి తరం ఉగాది పండుగ ప్రాముఖ్యతను అర్థం చేసుకునేలా సంప్రదాయ పద్ధతిలో వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. నర్సీపట్నం నియోజకవర్గంలోని 101 పంచాయతీలలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి గ్రామంలో పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి, సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలంతా సంబురంగా ఉగాదిని జరుపుకోవాలని కోరారు.

అవగాహనతో చట్టాల సద్వినియోగం

ప్రజాశక్తి -సీలేరు: రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఆలపాటి గిరిధర్ అన్నారు. ఆదివారం సీలేరు జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతూ, లక్ష్యాన్ని నిర్దేశించుకుని, పట్టుదలతో కృషి చేస్తే ఉన్నతస్థానాలకు చేరుకోవచ్చన్నారు. లక్ష్యసాధనలో మనం ఎక్కడున్నామనేది ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాతిపదిక కాదని సూచించారు. ఉన్నతస్థితిలో ఉన్నవారికి ఆదర్శంగా తీసుకుని, వారి మార్గంలో కృషి చేస్తే లక్ష్యాన్ని సులువుగా చేరుకోవచ్చన్నారు.

చట్టాలు, హక్కులు, బాధ్యతలపై ప్రజల్లో అవగాహన, చైతన్యం కల్గించేందుకు జిల్లావ్యాప్తంగా న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు.విద్యార్థిదశలో గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని, పాఠశాలల్లో, పనిప్రదేశాల్లో మహిళలు, బాలికలు లైంగిక వేధింపులకు గురైతే, బాధ్యులపై పోక్సోచట్టం కింద కేసులు నమోదు చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన శక్తియాప్‌ను సద్వినియోగం చేసుకుంటే సత్వరమే పోలీసుల సేవలు, రక్షణ పొందవచ్చన్నారు. లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను పోలీసుశాఖకే కాకుండా, ఐసిడిఎస్, రెవెన్యూ, విద్యా, మరే ఇతరశాఖకైనా నేరుగా ఫిర్యాదు చేయవచ్చుని, కోర్టు ద్వారా వస్తే కేసులు తీసుకుంటామన్నారు. పోక్సోచట్టంలో దోషులను చట్టపరంగా కఠినంగా శిక్షించడంతోపాటు బాధితులకు నష్టపరిహారం, ఇతర పద్ధతుల్లో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. చట్టం అందరికీ సమానమేనని, కొన్ని కేసుల్లో అబ్బాయిల్ని ఇబ్బంది పెట్టడానికి కొంతమంది అమ్మాయిలు, వారి తల్లిదండ్రులతో తప్పుడు ఫిర్యాదులు ఇస్తుంటారని, ఇలాంటి కేసుల్లో తప్పుడు ఫిర్యాదులు చేసిన వారితోపాటు దర్యాప్తు చేసిన పోలీసులు అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గిరిధర్



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గిరిధర్

జిల్లా న్యాయ సేనాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఎంవి. వెంకటశేషమ్మ మాట్లాడుతూ పోక్సో చట్టంపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మానవ అక్రమ రవాణా, డ్రగ్స్‌కు సంబంధించి ఫిర్యాదులపై పోలీసులతోపాటు అన్ని శాఖల అధికారులు స్పందిస్తారన్నారు.

న్యాయవిజ్ఞానసదస్సు సందర్భంగా వచ్చిన న్యాయమూర్తులను ఘనంగా స్వాగతించిన సీలేరు బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు, తర్వాత థింసా నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో చింతపల్లి సివిల్ జడ్జి ఎం.రోహిత్, డిఇఒ బ్రహ్మాజీరావు, సిడిపిఒ లక్ష్మీదేవి, జికెవీధి సిఐ వరప్రసాద్, తహశీల్దార్ రామకృష్ణ, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం నాగ శకుంతల, సీలేరు, ధారకొండ వైద్యాధికారులు ఖాదర్ మస్తాన్ వల్లి, హిమబిందు సీలేరు పంచాయతీ కార్యదర్శి పరుశు రాం, సర్పంచి దుర్జో, హెచ్‌ఎం నాగభూషణం, ఉపాధ్యాయులు ఐసిడిఎస్ సిబ్బంది అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి వితరణ



విద్యార్థులకు పరీక్ష సామగ్రి ఇస్తున్న పెద్దిరాజు రమణి

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు రాసి, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని స్థానిక సర్పంచ్ గొల్లపూడి రమణి, ఎంపిటిసి గొల్లపూడి పెద్దిరాజు అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా ఉన్నత పాఠశాలలో 97 మంది పదో తరగతి విద్యార్థులకు సర్పంచ్ గొల్లపూడి రమణి ఆధ్వర్యంలో విద్యాకమిటీ చైర్మన్ మరిచెర్ల శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ప్యాడ్లు, పెన్నులు, పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి హెచ్ఎం సత్యనారాయణ, ఎస్ఎంసి చైర్మన్ శ్రీనివాస్, టిడిపి మండల కార్యదర్శి ముప్పన్న కేశవ్, నాయకులు మోహన్ కుమార్, మధు, వీరాబాబు ఉన్నారు.

30న చెన్నకేశ్వరస్వామి సంబరం

ప్రజాశక్తి-విఆర్ పురం: ములకలపల్లి మండలం జగన్నాథం గ్రామంలో కొలువైన చెన్నకేశ్వర స్వామి ఉగాది సంబరాలను ఈనెల 30న రాత్రి 8 గంటలకు మండలంలోని రేఖపల్లిలో మామిడి రాజు ఇంటి వద్ద నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పల్నాడు జిల్లా కారంపూడి, మాచర్ల, నానలేరు గ్రామాల కులదైవం చెన్నకేశ్వర స్వామి వేడుకలను కారంపూడి దుర్గాదిపతి పిడుగు చెన్నకేశ్వరస్వామి ఆధ్వర్యంలో ంఖపల్లిలో మామిడి రాజు ఇంటి వద్ద ఘనంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల సందర్భమామిడి రాజు ఇంటి వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించి, స్వామిని ఊరేగింపుగా తోడుకొని రేఖపల్లి మండలపరిషత్, అ టవీశాఖ కార్యాలయాల మీదుగా, రేఖపల్లి, గొల్లగూడెం, రాజుపేట కాలనీ, పెద్దన్న వీధి. గొందేశి త్రినాధ్‌రెడ్డి ఇంటి మీదుగా ఊరేగింపు నిర్వహించి, తిరిగి, మామిడి రాజు ఇంటి వద్దకు తీసుకెళ్లి వేడు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జగన్నాథపురానికి చెందిన కాటారపు అప్పారావు కాటారేపువెంకట్రావు, కొనకళ్ళ సాయి, పామర్థి శ్యామ్, తలగాని నాగరాజు, వేములపల్లి రామారావు, తలడిని సత్తిబాబు, తలగాని మణి, జుత్తిక సూర్యచంద్రరావు, మామిడి వెంకటేశ్వరరావు, మామిడి పుణ్ణేశ్వరరావు, మామిడి బాల. మామిడి గంగాధర్, మామిడి చంద్ర శేఖర్, మామిడి వంశి గౌడ్, మామిడి చైతన్య కుమార్, తలగాని రామ చంద్ర, ముళ్ళపూడి రాంబాబు, గెడ్డం లక్ష్మణరావు వేడుకల్లో పాల్గొంటారన్నారు.

11 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండల కేంద్రం శివారులో శనివారం రాత్రి అధికారులు రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు .స్థానిక తాహశీల్దార్ ఎ. సత్యనారాయణ తెలిపిన వివరాలివి..బడదనాంపల్లి నుంచి ఏలేశ్వరం వైపు వెళ్తున్న వాహనాన్ని ముందస్తు అందిన సమాచారం మేరకు తనిఖీ చేయగా, బొలేరో వాహనంలో అక్రమంగా 22 బస్తాల్లో తరలిస్తున్న 1100 కేజీల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు.రేషన్ బియ్యం తరలిస్తున్న ఏలేశ్వరానికి చెందిన మొగిలి తాతయ్యపై కేసు నమోదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ చెల్లయ్యమ్మ, విఆర్ఒ రామదాసు, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనంలో పట్టుబడిన రేషన్‌బియ్యం

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి -గంగవరం : గంగవరం గ్రామ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదం లో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. గంగవరం నుండి అడ్డతీగల వెళ్లే దారిలో నెమలిచెట్టు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు అక్కడికక్కడే మతి చెందారు. అడ్డతీగల గ్రామం గొర్లె శేఖర్, వై రామవరం మండలం బూరుగుపాలెం గ్రామం కారం శ్రీనివాస్ ఎదురెదురుగా బైక్‌లు వస్తూ ఒకరినొకరు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది .ఈ ప్రమాదంలో వై.రామవరం ఆస్పత్రిలో డేటా ఎంట్రీగా పనిచేస్తున్న అడ్డతీగలకు చెందిన గొర్లె శేఖర్, బూరుగుపాలేనికి చెందిన శ్రీనివాస్ సంఘటనాస్థలిలోనే మృత్యువాత పడ్డారు.ఈ ప్రమాదంలో మరో మహిళకు, బాలునికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి, క్షతగాత్రులను రంపచోడవరం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న గంగవరం ఎస్ఐ వెంకటేశ్వరరావు, సంఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



సంఘటనాస్థలిలోనే మృతదేహాలు



మధ్యాహ్న భోజనాలను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

పాఠశాలలో తనిఖీ

ప్రజాశక్తి- హుకుంపేట:-మండలంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల గూడ లో ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే మత్స్యలింగం పేర్కొన్నారు. గూడ పాఠశాలలో సందర్శించిన ఎమ్మెల్యే విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులపై అవగాహన కల్పించారు. ధైర్యంతో పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం పెడుతున్న భోజనాన్ని సందర్శించారు. ఆదివారం బిర్యాని చికెన్ కర్రీ ముక్కలు పెట్టాల్సి ఉండగా గుడ్డు కూరతో సరిపెట్టి ఉండడంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. మంచి భోజనంతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తే విద్యార్థులు చదువులపై ఉన్నత స్థాయికి చేరడానికి అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. సరైన భోజనం లేక చదువులపై దృష్టి పెట్టలేరని ఆయన అన్నారు.



నృత్యం చేస్తున్న ఆదివాసీలు

ఆదివాసీల ఆందోళనతో రోడ్డు పనులు ప్రారంభం

-ఆనందంలో గిరిజనులు

ప్రజాశక్తి -అనంతగిరి: మంజూరైన రోడ్డు పనులు ఎట్టకేలకు పునఃప్రారంభంతో కావడం తో ఆదివాసీ గిరిజనులు సంతోషం వ్యక్తం చేశారు. బూరిగ, ఓనిజా గ్రామం వద్ద జరుగుతున్న రోడ్డు పనుల వద్ద ఆదివారం డప్పులు వాయిస్తూ థింసా నృత్యాలు ఆడారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, అటు విజయనగరం జిల్లా సరిహద్దు మండల గ్రామాలకు కనీస రోడ్డు సౌకర్యం లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఆ ప్రాంత గిరిజనులు వివిధ రూపాల్లో నిరసనలు ప్రదర్శించారు. ఈ నేపథ్యంలో ఆదివాసీల ఆందోళన విన్న కలెక్టర్ దినేష్ కుమార్ స్పందించి పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో బూరిగ, చిన్న కోనెల గిరిజనులు థింసా నృత్యంతో జిల్లా యంత్రాంగానికి ఆదివారం ధన్యవాదాలు తెలియజేశారు.

కనుజు మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : కైలాసగిరి వాకింగ్ ట్రాక్ హెల్త్ ఎరీనా బుద్ధుని విగ్రహం సమీపంలో కనుజు పిల్ల ఆదివారం ఉదయం మృతి చెంది పడి ఉంది. అటువైపు వెళ్లిన వాకర్స్ దానిని గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. రెండు రోజుల క్రితం మానుపిల్లి ఇదే విధంగా మృతి చెందిన సంగతి తెలిసిందే. ఎండలు తీవ్రంగా ఉండడం, తాగేందుకు నీటి సదుపాయం లేకపోవడంతో వన్యప్రాణులు చనిపోయి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. అటవీశాఖ అధికారులు హెల్త్ ఎరీనా కొండ అంచుల్లో అక్కడక్కడా వన్యప్రాణులకు నీటి సదుపాయం కల్పించాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

పాత పెన్షన్ స్కీమ్ సాధించేవరకూ పోరాటం

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

ప్రజాశక్తి -గోపాలపట్నం, కరాస : పాత పెన్షన్ స్కీం సాధించేంతవరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పోరాటాన్ని కొనసాగించాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ పిలుపునిచ్చారు. పాత పెన్షన్ స్కీమ్ నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పిఎస్) ఏకీకృత పెన్షన్ స్కీమ్ (యుపిఎస్)లు ప్రత్యామ్నాయం కాదని తెలిపారు. డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యాన మర్రిపాలెం ఉడా కమ్యూనిటీ హాల్లో ఆదివారం 'యుపిఎస్ వరమా? శాపమా?' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో అజశర్మ మాట్లాడుతూ, ఎన్‌పిఎస్‌తో పోలిస్తే పే అవుట్ పేరుతో పెన్షన్ ప్రకటించడమే యుపిఎస్‌లో సుగుణమని, దానిని పొందేందుకు అనేక షరతులు విధించారని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటివరకు 14 శాతానికి మరో నాలుగున్నర శాతం కంట్రిబ్యూషన్ పెంచిందని, ఈ నిధులన్నీ కార్పొరేట్లకు ఉపయోగపడేటట్టు షేర్ మార్కెట్‌కు పంపిస్తున్నారని చెప్పారు. ఉద్యోగికి ఇస్తున్న ప్రభుత్వ షేర్‌ను ఒక దగ్గర పెడితే ప్రభుత్వం ప్రకటించిన యుపిఎస్ కంటే ఓపిఎస్ ప్రకారం పెన్షన్ ఇవ్వడం ప్రభుత్వానికి భారం కాదని ఉదాహరణలతో వివరించారు. ఒకసారి యుపిఎస్‌లోకి వెళితే మరల తిరిగి వెనక్కి రాలేమని, ఏప్రిల్ 1వ తేదీన ఆప్షన్ ఇవ్వకుండా ఓపిఎస్ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

ఎన్‌జిఓస్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎవి.ప్రసాద్ మాట్లాడుతూ, ఐక్యంగా పోరాడితే ఓపిఎస్‌ను సాధించుకోగలమని చెప్పారు. ఎన్‌పిఎస్ వచ్చినప్పుడు ముందుగా వామపక్ష పార్టీలు, వామపక్ష ట్రేడ్ యూనియన్లు మాత్రమే గళమెత్తాయని గుర్తుచేశారు. పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ జ్యోతీశ్వరరావు మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పోరాడి ఓపిఎస్ సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సదస్సుకు అధ్యక్షత వహించిన డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు



సమావేశంలో మాట్లాడుతున్న అజశర్మ

మాట్లాడుతూ, పెన్షన్ కార్మికుల హక్కు అని సుప్రీంకోర్టు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. చట్టసభల ప్రజాప్రతినిధిగా గెలిచిన ఎంపీలు, ఎమ్మెల్యేలు జీవిత కాలం పెన్షన్ పొందుతున్నారు, ఏళ్ల తరబడి సేవలందించిన ఉద్యోగులకు దానిని లేకుండా చేయడం దుర్మార్గమని చెప్పారు. సుమారు కోటి మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన రూ.11 లక్షల కోట్లను షేర్ మార్కెట్లో పెట్టడమంటే జూదం ఆడటమేనని పేర్కొన్నారు. ఓపిఎస్ కోసం పోరాడాలని సదస్సు ఏకగ్రీవంగా తీర్మానించింది. విశాఖ రక్షణ రంగ కార్మిక వర్గాన్ని చైతన్యవంతం చేయడం కోసం పది రోజులు పాటు ప్రచారం చేయాలని అనుబంధ యూనియన్లను పిలుపునిచ్చింది. ఎన్‌ఎడిలో సస్పెండ్ అయిన 36 మందిని ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వై.రాజేష్, ఆర్.శ్రీనివాస్, కె.శ్రీనివాసరావు, జి.అరుణ్‌కుమార్, ఎ.సునీల్‌కుమార్, అహ్మద్, భాను, జి.బిర్లా, వై.శేఖర్ పాల్గొన్నారు.

12న భీమలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



మాట్లాడుతున్న ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు చిట్టిబాబు

ప్రజాశక్తి హుకుంపేట: మండలం లోని ఉక్కుర్బ గ్రామంలో భీమలింగేశ్వరస్వామి వారి దేవాలయం లో ఆదివారం ఉదయం ఆలయ కమిటీ సమావేశం ఆలయ గౌరవాధ్యక్షులు లకే చిట్టిబాబు అధ్యక్షతన నిర్వహించారు. వార్షికోత్సవాలకు సంబంధించి వివిధ కమిటీలను ఏర్పాటు చేశారు. వార్షికోత్సవ ఉత్సవ కమిటీ చైర్మన్ గా ఉక్కుర్బ గ్రామానికి చెందిన మాజీ వార్డు మెంబర్ కంబిడి సత్యనారాయణ, వైస్ చైర్మన్ గా ఒంటిపుట్టు గ్రామానికి చెందిన అడపా బంగారు నాయుడు ఎన్నుకోవడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. రాకాసిరాయి గ్రామం నుంచి సిరాగం కొండబాబు, పత్రిమెట్ట నుంచి పాంగి గణేష్, ఇసుకగారువు నుంచి గేమ్మెలి బుల్లిరాజు పొందెలి నుంచి సూకురు మత్యరాజులతో పాటు మరో 20 మంది సభ్యులను ఉత్సవ కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. .ఈ ఉత్సవాలలో భాగంగా ఏప్రిల్ నెల 12వతేదీన భీమలింగేశ్వరస్వామి వారిని భక్తిశ్రద్ధలతో ఉక్కుర్బ, ఒంటిపుట్టు, పత్రిమెట్ట, రాకాసిరాయి, ఇసుకగారువు, పొందెలి, తదితర గ్రామాల మీదుగా భారీ ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. 13వ తేదీన ప్రత్యేక పూజలు ,అనంతరం గిరిజన సంప్రదాయ నృత్యాల కార్యక్రమాలు, 14వ తేదీన ఆలయంలో ప్రత్యేక పూజలు హోమము తదితర కార్యక్రమాలు జరగనున్నట్లు వారు పేర్కొన్నారు. ఉత్సవాలలో భాగంగా మండల స్థాయి క్రికెట్ పోటీలను తామర్ల జనార్ధన్, గేమ్మెలి దిలీప్, మురళి సారథ్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పరదాని భీమలింగేశ్వరరావు, ఆలయ కమిటీ సీనియర్ సభ్యులు లకే సూరిబాబు, సూరిబాబు, లకే నీలకంఠం, ఈశ్వరరావు, లకే బొంజుమజ్జి, ప్రధాన కార్యదర్శి పూజారి రాంబాబు, కోశాధికారి కంబిడి కామేశ్వరరావు, తదితరులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు బలవంతపు వైద్య పరీక్షలు ఆపాలి

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికులకు బలవంతపు వైద్యపరీక్షలు ఆపాలని అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. పెదగంట్యాడ హౌసింగ్ బోర్డు వద్ద గల సిడబ్ల్యూసిలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ, గేటు పాస్ రెన్యువల్‌కు వెళ్లినప్పుడు వైద్య పరీక్షలు చేసుకుంటేనే రెన్యువల్ చేస్తామనడం పచ్చి దుర్మార్గం అన్నారు. కాంట్రాక్టు కార్మికులను తొలగించడానికి చేపడుతున్న ఈ వైద్య పరీక్షలకు వెళ్లవద్దని పిలుపునిచ్చారు. కార్మికుల తొలగింపు ఆపకపోతే సమ్మె తప్పదని హెచ్చరించారు. ఇప్పటివరకు తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. యాజమాన్యం చర్యలకు నిరసనగా ఈ నెల 18వ తేదీన ఇడి వర్క్స్ వద్ద భారీ ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నమ్మి రమణ, ఎల్.సోంబాబు, కె.వంశీ, కోన రమణ, పి.గురునాద్, డి.ఆనంద్, ఉమ్మిడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

జైల్లోకి సెల్ ఫోన్ తీసుకెళ్లిన కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారంలోకి సెల్ ఫోన్ తీసుకెళ్లిన కేసులో జైల్లో ఫార్మాసిస్ట్‌గా పనిచేసిన కడియం శ్రీనివాసరావు, అతని భార్య కడియం పుష్పలతను ఆరిలోవ పోలీసులు ఆదివారం సాయంత్రం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేంద్రకారాగారంలో గతంలో ఫార్మాసిస్ట్‌గా పనిచేసిన కడియం శ్రీనివాసరావు రెండు మొబైల్ ఫోన్లను జైల్లో శిక్ష అనుభవిస్తున్న నాగమల్లేశ్వరరావుకు ఇచ్చిన విషయం నిర్ధారణ కావడంతో ఆరిలోవ ఎస్ఐ కృష్ణ ఆదివారం దారపాలెం వద్ద భార్యాభర్తలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-మునగపాక: మండల కేంద్రం మునగపాకలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన మాడా కన్నారావు (52) మృతి చెందారు. విషయం తెలుసుకున్న పరవాడ డిఎస్‌పి విష్ణు స్వరూప్, సీఐ అల్లు స్వామి నాయుడు, ఎస్సై పి ప్రసాదరావులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించి స్థానిక ఎస్ఐ పి. ప్రసాదరావు అందించిన వివరాలివి.
ఆదివారం ఉదయం కాయగూరలను కొనేందుకు ఇంటి నుండి స్కూటీపై మార్కెటు రోడ్డులో కన్నారావు వెళ్తుండగా, అదే సమయంలో అచ్యుతాపురం నుండి అనకాపల్లి వెళుతున్న లారీ స్కూటీ పక్క భాగాన్ని ఢీకొట్టడంతో కన్నారావు అదుపుతప్పి లారీ చక్రాల కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తలభాగం చితికి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కన్నారావుకు ఇద్దరు భార్యలు కాగా, ముగ్గురు సంతానం. మృతుడు మొదటి భార్య మాడా పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



బాధితులతో మాట్లాడుతున్న సాగిన ధర్మానపడాల్

పింఛను రద్దు అన్యాయం

ప్రజాశక్తి -జిమాడుగుల:మండలంలోని వంతల పంచాయతీ చింతగొంది గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మహిళలకు పెన్షన్ రద్దు చేయడం చాలా బాధాకరమని, వెంటనే పునరుద్ధరించాలి. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మానపడాల్ డిమాండ్ చేశారువంతల పంచాయతీ చింతగుంది గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరికి గత 20 సంవత్సరాల నుంచి పింఛన్ ఇస్తూ ఉన్నారన్నారు. వీరికి సెంటు భూమి లేకున్నా .16 ఎకరాలు భూమి ఉందనే రికార్డులో తప్పు నమోదు కావడంతో పెన్షన్ తొలగించడం జరిగిందన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే వీళ్లకు పింఛన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

సమగ్ర శిక్ష ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : సమగ్ర శిక్ష ద్వారా 2012 నుంచి ఆర్ట్, వర్క్, పిఇటిలుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, అది సాధ్యం కాకపోతే కనీసం సమాన పనికి సమాన వేతనం (ఎంటిఎస్) వర్తింపజేయాలని ఎపి జెఎసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. పౌర గ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ వర్క్, ఆర్ట్, పిఇటి ఇన్‌స్ట్రక్టర్ల యూనియన్ వెల్ఫేర్ అసోసియేషన్ విశాఖ ఉమ్మడి జిల్లా ప్రాంతీయ సదస్సు ఆదివారం నిర్వహించారు. సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 5800 మంది ఉపాధ్యాయులు, 460 మంది కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ ఉపాధ్యాయులకు బోధన చేసేందుకు తగిన విధంగా సిలబస్ లేకపోవడం, బోధన పనికంటే ఇతర పనులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జారీ చేసిన జిఒ ప్రకారం ఇఎస్ఐ, ఇపిఎఫ్ ప్రయోజనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.



'స్టీల్‌ప్లాంట్‌కు ఊతమివ్వని ప్యాకేజీ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కార్మికులకు నష్టం చేసేటటువంటి నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని ఆదివారం జరిగిన సిఐటియు విశాఖ జిల్లా కౌన్సిల్ సమావేశం డిమాండ్ చేసింది. ఎంవిపి.కాలనీ సెక్టార్ -5లోగల ఐక్యత భవన్‌లో ఈ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందన్నారు. ఇప్పటికే దేశంలోగల విమానాశ్రయాలను, నౌకాశ్రయాలను, చమురు సంస్థలను, వివిధ ప్రభుత్వ పరిశ్రమలను కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెట్టేందుకు నిర్ణయించిందన్నారు. అందులో భాగంగానే స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయాలని శతవిధాలా ప్రయత్నిస్తోందన్నారు. స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం రూ.11,445 కోట్లు ఆర్థిక ప్యాకేజీ ఇచ్చామని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కానీ ఆ ప్యాకేజీ డబ్బులను స్టీల్‌ప్లాంట్ అభివృద్ధి కోసంగానీ, ఉత్పత్తి, కార్మికుల జీతాల కోసంగానీ ఉపయోగించడం లేదన్నారు. పాత బ్యాంకు అప్పులను తీర్చడం కోసం ప్యాకేజీ నిధులను వాడటం దుర్మార్గమన్నారు. మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందన్నారు. అందులో భాగంగానే 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్పు చేసిందన్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈ లేబర్ కోడ్స్‌ను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా ప్రయత్నం చేస్తోందన్నారు. అవి అమలయితే కార్మికులు అనుభవిస్తున్నటువంటి ప్రస్తుత హక్కులన్నీ కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అందుకనే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ మేలో దేశవ్యాప్తంగా అఖిలభారత సమ్మె నిర్వహించాలని కేంద్ర కార్మిక సంఘాలన్నీ ఇప్పటికే నిర్ణయించాయన్నారు. ఈ జాతీయ సమ్మెను జయప్రదం చేయడం ద్వారా మోడీ విధానాలకు అడ్డుకోవడం సాధ్యపడుతుందన్నారు. లేబర్ కోడ్స్ వల్ల కార్మికులకు జరిగే నష్టాలను కింది వరకూ తీసుకువెళ్లాలని, అందులో భాగంగా విస్తృతంగా కరపత్రాలు, బుక్‌లెట్స్ పంపిణీ చేయాలని, గ్రూప్ మీటింగ్‌లు జరపాలని తీర్మానించామన్నారు. సమావేశంలో 'స్టీల్‌ప్లాంట్‌కు ఊతమివ్వని ప్యాకేజీ' బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పి.మణి, ఎస్.జ్యోతీశ్వరరావు, యు.రాజు మాట్లాడారు. స్టీల్ ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, విశాఖ పోర్ట్ యూనియన్, ఆశ, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన పథకం, మున్సిపల్, ఆటో, భవన నిర్మాణ, ఇంటిపనివారుల సంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ హయాంలో కూలిన వ్యవస్థలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ కూలిపోయాయని టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ విమర్శించారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సిఎంగా పగ్గాలు చేపట్టే నాటికి సుమారు 11 లక్షల కోట్లు అప్పులతో ఈ రాష్ట్రం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు.

జగన్ హయాంలో హంద్రీ నీవా, తోటపల్లి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంటి ప్రాజెక్టులు ఆగిపోయాయన్నారు చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఉమ్మడి విశాఖ ఉత్తరాంధ్ర జిల్లాలో 2 లక్షల కోట్లు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. పోలవరం కోసం రూ.15 వేల కోట్లు అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. సూర్య ఘర్ ద్వారా సోలార్ విద్యుత్ అందిస్తున్నారన్నారు. వైసిపి మాజీ నేత విజయసాయిరెడ్డిలో పరివర్తన వచ్చిందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గొంపా సత్యనారాయణ, ఉత్తర నియోజకవర్గం నాయకులు భరత్ పాల్గొన్నారు.

తల్లడిల్లుతున్న తాడి

హామీకే పరిమితమైన తరలింపు
15 ఏళ్లుగా ప్రభుత్వాలకు పట్టని సమస్య
కాలుష్యంతో ప్రజలు అనారోగ్యాలపాలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, పరవాడ విలేకరి


ఔషధ పరిశ్రమలకు అతి సమీపంలోని అనకాపల్లి జిల్లా పరవాడ మండలం తాడి ప్రజలు దాదాపు 15 ఏళ్ల నుంచి కాలుష్య సమస్యతో బాధపడుతున్నారు. అయినా ఏ ప్రభుత్వమూ కనికరించలేదు. భరించలేని కాలుష్యంతో చర్మ వ్యాధులు, శ్వాసకోశ, గుండె జబ్బులు, కీళ్ల నొప్పులు, కిడ్నీ, గర్భస్రావ, నిద్రలేమి సమస్యలతో చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు బాధపడుతున్నా ఏ ఎమ్మెల్యే, ఎంపీ మనసు కరగలేదు. తాడి, చినతాడి, బిసి కాలనీ ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించి ఆదుకోవాలనే గట్టి ప్రయత్నం వారెవరూ చేయలేదు. ఫలితంగా అనేక అనారోగ్య సమస్యలతో తాడి ప్రజలు మంచానపడుతున్నారు.

నాడు ఏం జరిగింది ?

2,400 ఎకరాల విస్తీర్ణంలో 2006లో పరవాడలోని జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీ (జెఎన్‌పిసి)ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రభుత్వ పరిధిలోని ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి)కి కాకుండా ర్యాంకీకి భూమిని అప్పగించింది. ర్యాంకీ ఆది నుంచీ పర్యావరణ ప్రమాణాలు పాటించలేదు. గ్రీన్‌బెల్ట్‌కు కేటాయించిన స్థలాన్ని కూడా విక్రయించి లాభాలు ఆర్జించింది. వ్యర్థాలు శుద్ధి చేయకుండా విడిచిపెట్టడంతో భూగర్భ జలాలు, గాలి కాలుష్యం కావడంతో తీవ్రమైన అనారోగ్య సమస్యలు వచ్చాయని ప్రజలు చెబుతున్నారు.

తాడి తరలింపును ఎన్నికల అంశంగా టిడిపి, బిజెపి, జనసేన, వైసిపి వాడుకున్నాయి తప్పితే పరిష్కారానికి గట్టి ప్రయత్నం చేయలేదు. తరలింపు తనకు సంబంధం లేదని ర్యాంకీ, ఎంతోకొంత చెల్లించి బయటపడిపోదామని ప్రభుత్వాలు భావిస్తూ వస్తున్నాయి. పరిశ్రమలతో భూములు కోల్పోయి, కాలుష్యంతో బతుకులు పోగొట్టుకున్న బాధిత ప్రజలకు న్యాయమైన పరిహారం చెల్లించి తరలించాలని ఏ ప్రభుత్వమూ అనుకోవడంలేదు. ఎన్నికల ముందు తాడి తరలింపు తమ బాధ్యతని హామీ ఇవ్వడం, ప్రమాణాలు చేయడమేగానీ తరువాత తరలింపును విస్మరిస్తున్నారు. నాలుగు ప్రభుత్వాలు మారినా తాడి తరలింపునకు నోచుకోలేదు. ఎన్‌జిటి ఆదేశంతో తాగునీటి సమస్య కొంతవరకు తీరిందిగానీ గెలిచిన ఏ ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ నీటి సమస్యను తీర్చలేదు. కాలుష్య వాసన భరించలేక తలుపులు వేసుకొని సాయంత్రం నుంచి తెల్లవారే వరకు గ్రామస్తులు బయటకు రాలేని పరిస్థితివుంది. నిల్వ చేసుకున్న నీటిపై 24 గంటలు గడిచేసరికి నల్లటి పొర ఏర్పడుతోందని బాధితులు చెబుతున్నారు.

'ఒకప్పుడు కూరగాయలు బాగా పండించే మేము పరిశ్రమలొచ్చాక కాలుష్యానికి పంటలు పండక కొనుక్కోవాల్సి వస్తోంది. ఇప్పుడు నీటికి ఇబ్బంది పడుతున్నాం. వయస్సు తేడా లేకుండా జబ్బులతో బాధపడుతున్నాం. పుట్టినవాళ్లు అనారోగ్యంతో పుడుతున్నారు. అర్హతను బట్టి పని ఇవ్వడంలేదు. వూరు తరలిస్తామని ఎమ్మెల్యే, ఎంపీలు చెప్పడమేగానీ తరలించడంలేదు' అని ఈ నెల 11న ప్రజా చైతన్యయాత్రలో భాగంగా తాడి వెళ్లిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముందు మహిళలు వ్యక్తంచేసిన ఆవేదన ఇది. దీనిని బట్టే వారు ఎన్ని ఇబ్బందులను ఎదుర్కొంటున్నారో ఇట్టే చెప్పొచ్చు.



కాలుష్య బాధిత తాడి గ్రామం

ఎన్నికల ముందు 2019 ఫిబ్రవరి 6న తాడి, చినతాడి, బిసి కాలనీ ప్రజలను పెదముషిడివాడ తరలింపునకు రూ.57.63 కోట్లు విడుదల చేస్తూ చంద్రబాబు ప్రభుత్వం జిఒ 29ని జారీ చేసిందికానీ నిధులు విడుదల చేయలేదు. పది రోజుల్లో తాడి గ్రామం తరలింపునకు అవసరమైన రూ.56 కోట్లు ఇస్తామని 2022 ఏప్రిల్ 28న సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలో జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారుగానీ తరలింపు చర్యలు చేపట్టలేదు. అసెన్షియా ఫార్మా కంపెనీ ప్రమాద స్థలం పరిశీలనకు 2024 ఆగస్టు 22న కంపెనీకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును మీడియా ప్రశ్నించగా తాడి తరలింపుపై వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినా ఆ తరువాత ఆ ఊసే మర్చిపోయారు.

పరిహారం చెల్లించి తరలించాలి

2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఇళ్లు, భూములకు పరిహారం, మేజర్లకు ప్యాకేజీ చెల్లించాలి. తాజాగా సర్వే చేసి మేజర్లను గుర్తించాలి. సురక్షిత ప్రాంతంలో మౌలిక సదుపాయాలన్నీ సమకూర్చి, పునరావాసం కల్పించి తాడి, చినతాడి, బిసి కాలనీ ప్రజలను తరలించి ఆదుకొనే చర్యలను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలి.

గనిశెట్టి సత్యనారాయణ,
సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

బీచ్ రోడ్డులో గ్లకోమా అవేర్‌నెస్ వాక్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలోని ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం బీచ్ రోడ్డులోని కాళీ మాతా మందిరం నుంచి వైఎంసిఎ వరకూ గ్లకోమా అవేర్‌నెస్ వాక్ నిర్వహించారు. సంస్థ ఆధ్వర్యంలో నేత్ర సంరక్షణా వ్యవస్థపై ఈ నెల 8 నుంచి 16 వరకూ అవగాహనా వారోత్సవాలను నిర్వహించి, చివరి రోజు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ క్యాంపస్ హెడ్ డాక్టర్ వీరేంద్ర సచ్‌దేవ్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా గ్లకోమా బాధితులు 80 మిలియన్ల మంది ఉన్నారన్నారు. అందులో దాదాపు 50 శాతం మందికి గ్లకోమా ఉందనే అవగాహన కూడా లేదని తెలిపారు. చికిత్స చేయకపోతే గ్లకోమా అంధత్వానికి దారి తీస్తుందని పేర్కొన్నారు. గ్లకోమా కన్సల్టెంట్ ఆప్థల్మాలజిస్ట్ డాక్టర్ శివాని కోడాలి పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - రంపచోదవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో రంపచోడవరం, సిరిగిందలపాడులో ఆదివారం ప్రత్యేక వైద్య శిభిరం నిర్వహించారు. వైద్యశిబిరంలో 400 మందికి ఆరోగ్య పరీక్షలు, చికిత్సలు నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్, మేనేజర్ స్వామీజీ రఘువీరనంద మహారాజ్ తెలిపారు.

అలాగే వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 78మందికి కంటి పరీక్షలు నిర్వహించి, వారిలో దృష్టిలోపం ఉన్న నలుగురిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసి, వేమగిరి ఆసుపత్రికి తరలించారు. 32మందికి కళ్లద్దాలు రిఫర్ చేయా, మిగతా అవసరమైన వారికి మందులు అందజేశారు. వైద్య శిబిరంలో డాక్టర్ జివి.రామారావు, డాక్టర్ కస్తూరి సుబ్రమణ్యం, డాక్టర్ శ్రీకృష్ణ పాతూరి, డాక్టర్ టివి .సుబ్బారావు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ ఎస్. సంపత్ కుమార్, జిఎస్ఎల్ వైద్యులు పాల్గొని సేవలు అందించారు. కార్యక్రమంలోక్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వాలంటీర్స్ ఎల్‌జిబి.భగీరథ రాజు, చంద్రరావు, మంగిరెడ్డి చంద్ర శేఖర్,సిబ్బంది పాల్గొన్నారు. శిబిరానికి వచ్చిన రోగులు, సహాయకులకు భోజన సదుపాయం కల్పించారు.

బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు

ప్రజాశక్తి- దేవీపట్నం : బోయ/ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చవద్దని ఆదివాసీ జెఎసి రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ అన్నారు. ఆదివారం దేవీపట్నం మండలం ఇందుకూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని పార్లమెంట్లో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే విధానాలు, రాజకీయ కుట్రలతో ఆదివాసీల జీవన మనగడ హక్కులు, చట్టాలకు నష్టం వాటిల్లి, ఆదివాసుల అస్తిత్వానికి గుర్తై, వారి భవిష్యత్తుకు రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఆదివాసీలకు అన్యాయం జరిగితే రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ జెఎసి రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర, మండల కార్యదర్శి యలగాడ నాగేశ్వరరరావు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి- దేవీపట్నం : అక్రమంగా తరలిస్తున్న 12 మద్యం బాటిల్స్ పట్టుకున్నామని స్థానిక ఎస్ఐ షరీఫ్ తెలిపారు. ఆదివారం అంగుళూరు గ్రామ సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా మద్యం బాటిల్స్ కలిగి ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితుడి నుంచి ఎనిమిది బీర్ బాటిల్స్, 12 విస్కీ క్వార్టర్ బాటిల్స్ స్వాధీన పరచుకున్నామని తెలిపారు. మద్యం బాటిల్స్ అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీనికి సంబంధించి మరిన్ని వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భీమిలి శాసన సభ్యులు గంటా శ్రీనివాస రావు ఆదివారం ఉదయం ఎంవిపి.కాలనీలోగల ఆయన నివాసంలో విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంటా భీమిలి అసెంబ్లీ నియోజకవర్గం గుండా వెళ్లే ప్రతిపాదిత బృహత్తర ప్రణాళికా రహదారులు గురించి అడిగి తెలుసుకున్నారు. వీటి ద్వారా జాతీయ రహదారిపై ఒత్తిడి తగ్గి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రజలు మరింత సులభవంతంగా, సౌకర్యవంతంగా చేరుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

లక్ష మంది మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : లక్ష మంది మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా షీరో సంస్థ పనిచేస్తోందని సంస్థ వ్యవస్థాపకులు జయశ్రీ తిలక్ తెలిపారు. ఆదివారం నగరంలోని దసపల్లా హోటల్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ అనేక మంది మహిళలు అటు ఉద్యోగం, ఇటు వ్యాపారం చెయ్యలేక సతమతమవుతున్నారని తెలిపారు. అలాంటి వారు ఇంటి నుంచే పనిచేసేలా షీరో సంస్థ నేనున్నాను అంటూ ప్రోత్సహిస్తోందన్నారు. ఎటువంటి పెట్టుబడీ లేకుండా తమ కిచెన్‌లో వుండే వంట సామానులతోనే ఇంటి వంటకాలను తయారు చేసి ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్స్ వచ్చేలా చేసి తద్వారా మహిళలు ప్రతినెలా స్థిరమైన ఆదాయాన్ని పొందేలా షీరో సంస్థ అండగా నిలుస్తోందని తెలిపారు. ఈసరికే 3 వేల మందికి ఉపాధి ఇస్తున్న తమ సంస్థ మహాప్రసాద్ పేరిట మరో బ్రాండ్‌ను ప్రారంభించి తద్వారా మహిళలు తాము నిత్యం చేసే స్వీట్స్, స్నాక్స్, పొడులు, నిల్వ పచ్చళ్ళను ఆన్ లైన్ ద్వారా అమ్ముకునేలా ఒక వేదికను ప్రారంభించిందని తెలిపారు. ఈ లోగోను బాలీవుడ్ హీరోయిన్లు మౌబాని సర్కార్, ముంతాజ్ సర్కార్, అల్వియా ముఖర్జీ, దనీ బోస్, స్నేహ షా, ప్రీతా మోజెందర్, ఎఫ్‌టిపిసి ఇండియా అధ్యక్షులు చైతన్య జంగాలు ఆవిష్కరించారు.